# కష్టపడినప్పుడే సత్ఫలితాలు సాధ్యం

**- ఆర్టీసీ డిపో-1 మేనేజర్ జలగం విజయ్**

హయత్‌నగర్, అక్టోబర్ 20: కష్టపడడంతోనే వాటి సత్ఫలితాలు సాధ్యమవుతాయని ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1 మేనేజర్ జలగం విజయ్ అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ డిపో-1లో మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం ఎదుట బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిపో మేనేజర్ విజయ్ హాజరై మాట్లాడుతూ.. సంస్థలో ఉత్తమ ఉద్యోగులకు అన్ని కేటగిరి వాళ్లకు అభినందనలు అందుతాయని, ప్రతిఒక్కరూ అవార్డులు పొందడానికి కృషి చేయాలని సూచించారు. సెప్టెంబర్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 24 మంది ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్లు విజయకుమారి, చందర్, శ్రీనివాసరెడ్డి, కరుణ, ఉదయశ్రీ, సుజాత, మమత, శ్రీలత, శివలీల సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డిపో మేనేజర్ విజయ్, మహిళా ఉద్యోగులు

# వైభవంగా సరస్వతి హోమం

వనస్థలిపురం, అక్టోబర్ 20: సచివాలయనగర్ కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన సరస్వతి హోమం కన్నులపండువగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, శ్రీవారికి అష్టోత్తర శత రజిత కలశ పంచామృత స్నపన తిరుమంజనము. తిరువీధి ఉత్సవము, సామూహిక విశేష కుంకుమార్చనలు జరిగాయి. సాయంత్రం మహాలక్ష్మి హోమం, గజ వాహనముపై తిరువీధి ఉత్సవం, దీపోత్సవం, మహానివేదన, పవళింపు సేవలు జరిగాయి. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర దేవస్థానంలో నిర్వహిస్తున్న సరస్వతి హోమం











